# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శుక్రవారం 10, జులై 2026






## అడవిబాట నుంచి



# ఊరి బాటకు..

### చంద్రవల్లిలో పుష్పకు ఘనస్వాగతం

**బెల్లంపల్లి, జూలై 09, ప్రభాతవార్త**

ఒకప్పుడు అడవుల్లో తుపాకీతో తిరిగిన అడుగులు.. ఇప్పుడు ఊరి బాట పట్టాయి. పోలీసులకు లొంగిపోయిన మాజీ మావోయిస్టు జాడి పుష్ప స్వగ్రామం చేరుకోవడంతో మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం చంద్రవల్లి గ్రామం ఆనందంతో పాటు విషాదాన్ని కూడా అనుభవించింది. ఒక వైపు ఆమె ప్రాణాలతో తిరిగి రావడం సంతోషం కలిగిస్తే, మరో వైపు భర్తను కోల్పోయిన బాధ గుండెల్ని పిండేసింది. చంద్రవల్లి గ్రామానికి చెందిన జాడి వెంకటి-పుష్ప దంపతులు ఆశయాల కోసం 20 ఏళ్ల క్రితం అడవిబాట పట్టారు. నమ్మిన సిద్ధాంతం కోసం ప్రాణాలకైనా తెగించి పోరాటం సాగించారు. అయితే ఆ పోరాటం చివరకు రక్తంతో ముగిసింది. ఇటీవల జరిగిన కగార్ ఆపరేషన్‌లో జాడి వెంకటి మృతి చెందగా, ఆ దృశ్యం తన కళ్లముందే చూసిన పుష్ప మనసు ఛిద్రమైంది. భర్త మరణం తర్వాత కూడా కొంతకాలం ఉద్యమంలో కొనసాగిన ఆమె, అనారోగ్యం మరియు జీవన వాస్తవాల ముందర నిలవలేక చివరకు లొంగిపోయింది. మూడు నెలల క్రితం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గరియాబంద్‌లో తన సహచరురాలు అంజుతో కలిసి ఆయుధాలతో పోలీసులకు లొంగిపోయిన పుష్ప, ఇప్పుడు స్వగ్రామం చేరుకుంది. ఆమె రాకతో గ్రామంలో అసాధారణ దృశ్యాలు కనిపించాయి. పూలమాలలు, డప్పు చప్పుళ్లు, ఊరేగింపులు.. ఒకప్పుడు అడవిలో అడుగుపెట్టిన ఆ మహిళకు ఊరు తిరిగి ఆలింగనం చేసుకుంది. గ్రామ పొలిమేరల దగ్గరే కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు ఆమెను ఆప్యాయంగా ఆహ్వానించారు. అయితే ఈ స్వాగతం వెనుక మిగతా 2లో..

కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో

# మంచిర్యాల జిల్లాకు 2వ స్థానం

✪ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల జూలై 9, ప్రభాతవార్త :**

కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ 2025 26 విద్యా సంవత్సరానికి సంబంధించి విడుదల చేసిన పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ ర్యాంకులో మంచిర్యాల జిల్లా 360 స్కోర్ తో రాష్ట్రంలో 2వ స్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో మిగతా 2లో..



# ఓటరు ఇంటికి వెళ్లి వివరాలు తెలుసుకున్న జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

✪ బాసరలో ఎస్ఐఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్



**భైంసా, జులై 09, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా బాసర మండల కేంద్రంలో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాలను పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా గురువారం బాసరాలో పర్యటించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పలు వీధుల్లో పర్యటించిన ఆయన, ఒక ఓటరు ఇంటికి స్వయంగా వెళ్లి ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ వివరాలను అడిగి తెలుసుకున్నారు.కలెక్టర్ అడిగిన వివరాలపై సదరు ఓటరు కల్పన స్పందిస్తూ.. ప్రత్యేక ఓటరు జాబితా సవరణకు సంబంధించిన ఎన్యుమరేషన్ ఫారమ్‌ను ఇప్పటికే పూర్తిగా నింపి సంబంధిత బూత్ లెవెల్ అధికారికి అందజేసినట్లు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ క్షేత్రస్థాయి పరిశీలన ముగించుకుని, అధికారులతో మాట్లాడారు. జిల్లాలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను సూచించారు. ఈ పర్యటనలో బాసర తహసీల్దార్ పవనచంద్ర, స్థానిక సర్పంచ్ వెంకటేష్ గౌడ్, ఎంపీడీవో దేవేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ సయ్యద్ అలీ, బూత్ లెవెల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కుక్క అడ్డురావడంతో కారు బోల్తా..



### ఒకరు మృతి, నలుగురికి తీవ్ర గాయాలు



**మామడ, జూలై 9, ప్రభాతవార్త:**

మామడ మండలంలోని దిమ్మదుర్తి గ్రామ సమీపంలోని డాంబర్ ప్లాంట్ వద్ద గురువారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఖానాపూర్ మండలం రాజుర గ్రామానికి చెందిన గంగడి దశరథ్ రెడ్డి (50) అక్కడికక్కడే మృతి చెందారు. మరో మిగతా 2లో..

# సాంకేతిక సేవలను ప్రజలకు చేరవేయాలి

✧ ఫిర్యాదుల పై పారదర్శకంగా విచారణ చేపట్టాలి

✧ రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**తాండూర్ జులై 9, ప్రభాతవార్త :**

ఫిర్యాదులపై పోలీస్ అధికారులు పారదర్శకంగా విచారణ నిర్వహించి, బాధితులకు నమ్మకం, భరోసా కల్పిస్తూ అండగా నిలవాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. మంచిర్యాల జిల్లా తాండూర్ సర్కిల్ పరిధిలోని మాదారం పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన సందర్శించారు. స్టేషన్‌కు చేరుకున్న సీపీకి పోలీస్ అధికారులు పూల మొక్క పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం రిసెప్షన్, ఐటీ విభాగం సిబ్బంది, ఇతర పోలీస్ సిబ్బంది పనితీరును మిగతా 2లో..

# సాంకేతిక సేవలను ప్రజలకు చేరవేయాలి

(మొదటిపేజీ తరువాయి)

సమీక్షించి,వారి విధుల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు.స్టేషన్ హౌస్ అధికారిని ఎస్ఐ సౌజన్య వద్ద నిర్వహిస్తున్న స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసుల వివరాలు, ఇతర రికార్డులను పరిశీలించారు. అలాగే స్టేషన్ నిర్వహణ తీరును సమీక్షించి, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరాల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, స్టేషన్‌కు వచ్చే బాధితులు ప్రజలకు ప్రశాంతమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని సూచించారు.ప్రతి కానిస్టేబుల్ తమ పరిధిలోని గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శించి, ప్రజలతో మమేకమై శాంతిభద్రతలకు సంబంధించిన సమస్యలను తెలుసుకోవాలని ఆదేశించారు. విధుల్లో ఉన్న సమయంలో తప్పనిసరిగా లాఠీ వెంట ఉంచుకోవాలని సూచించారు.పోలీస్ స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ,ఎలాంటి పెండింగ్ లేకుండా నిర్వహించాలని ఆదేశించారు. అలాగే చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. ఆయన వెంట మంచిర్యాల డిసిపి భాస్కర్, బెల్లంపల్లి ఏసిపి కిరణ్ కుమార్, తాండూర్ సి.ఐ. దేవయ్య, తాండూర్ ఎస్సై ప్రసాద్ రావ్, సిబ్బంది ఉన్నారు.

## అడవిబాట నుంచి ఊరి బాటకు..

(మొదటిపేజీ తరువాయి)



ఒక చేదు నిజం దాగి ఉంది. ఆశయాల కోసం అడవికి వెళ్లిన దంపతుల్లో ఒకరు మాత్రమే తిరిగి రావడం గ్రామాన్ని మౌనంగా నిలబెట్టింది. జాడి వెంకటి తన నమ్మకాన్ని చివరి శ్వాస వరకూ వదల్లేదు.. కానీ పుష్ప మాత్రం జీవితం కోసం తిరిగి వచ్చింది. ఇప్పుడు ప్రశ్న ఒక్కటే ఆ పోరాటం ఎవరి కోసం? ఎవరి కోసం ఈ త్యాగాలు? చివరకు కుటుంబాలే ఖాళీ అయ్యే పరిస్థితి ఎందుకు? ఇకపై జాడి పుష్ప సాధారణ జీవితం గడపనుంది. ప్రాణాలతో తిరిగి వచ్చిన తన గ్రామ బిడ్డను చూసి గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. కానీ ఆ ఆనందంలోనూ ఒక నిశ్శబ్ద విషాదం మాత్రం మిగిలే ఉంది.

## కుక్క అడ్డురావడంతో కారు బోల్తా..

(మొదటిపేజీ తరువాయి)

నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు వ్యక్తులు దిలావర్‌పూర్ మండలం పాత సాంగ్వి గ్రామంలో జరిగిన అంత్యక్రియలకు హాజరై తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. దిమ్మదుర్తి గ్రామ సమీపంలోని డాంబర్ ప్లాంట్ వద్దకు రాగానే అకస్మాత్తుగా కుక్క అడ్డురావడంతో కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న గంగడి దశరథ్ రెడ్డి మృతి చెందగా, గంగడి పుష్పలత, గంగారెడ్డి, లింగారెడ్డి, భీమ్ రెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో నిర్మల్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## 12వ వేజ్ బోర్డు తొందరగా సాధించాలి

**- బెల్లంపల్లి ఏరియా టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు**

తాండూర్, ప్రభాతవార్త :



సింగరేణి కార్మికుల 12వ వేజ్ బోర్డు తొందర సాధించాలని బెల్లంపల్లి ఏరియా టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ రావు అన్నారు. గురువారం గోలేటి వర్క్ షాప్ ఏరియా స్టోర్స్ లో ఫిట్ సెక్రెటరీ గాజలేని శ్రీనివాస్ అధ్యక్షతన నాయకులు పర్యటించారు. ఆయన మాట్లాడుతూ జూన్ 31వ తేదీతో 11వ వేతన కాలపరిమితి ముగిసిందని జులై 1వ తేదీ 2026 నుండి 12 వ వేతన ఒప్పంద కాలం ప్రారంభం అయిందన్నారు. జాతీయ సంఘాలు కనీస ఉమ్మడి డిమాండ్ల పత్రం కోల్ ఇండియా యాజమాన్యానికి ఇవ్వలేదని, జేబీసీసీఐ కమిటీ వేయలేదని దీంతో బొగ్గు గని కార్మికులకు అన్యాయం జరుగుతున్నదనీ వెంటనే వేతన ఒప్పందం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.సింగరేణిలో బొగ్గు గనుల టెండర్ లో సైట్ విజిట్ విధానం కు తెరలేపి సింగరేణి లో ఎక్సెస్ టెండర్లు వేసి సింగరేణిని నిర్వీర్యం చేస్తున్న గుర్తింపు సంఘం ప్రేక్షక పాత్ర ప్రదర్శిస్తుందని ఆరోపించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వ బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి నామినేటెడ్ పద్ధతిలో సింగరేణికి తాడిచర్ల బొగ్గు బ్లాక్ 2 కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సత్తుపల్లి త్రీ, కోయగూడెం త్రీ బొగ్గు బ్లాకులను ఇప్పటికే ప్రైవేటు వారి కేటాయించారని నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా వారు బొగ్గు ఉత్పత్తి చేయడం లేదని, వెంటనే వారి కేటాయింపులను రద్దుచేసి వాటిని కూడా సింగరేణికే నామినేటెడ్ పద్ధతిలో కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ మంగీలాల్, ఏరియా కార్యదర్శి మారిన వెంకటేష్, స్టోర్ పిట్ సెక్రటరి గణపతి, అసిస్టెంట్ సెక్రటరీ సురేష్, నాయకులు వెంకన్న, సూరం వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, సంగి ప్రశాంత్, వెంకట్, కనకయ్య వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభతరం

**- నూతన మీసేవ కేంద్రాన్ని ప్రారంభించిన బోథ్ ఇంచార్జ్ ఆడే గజేందర్**

నేరడిగొండ, జూలై 9, ప్రభాతవార్త:

గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా, పారదర్శకంగా అందుబాటులోకి రావడంలో మీసేవ కేంద్రాలది కీలక పాత్ర అని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ చెప్పారు. గురువారం నేరడిగొండ మండలంలోని వడూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మీసేవ కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ.. కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, జననమరణ ధ్రువపత్రాలతో పాటు పింఛన్లు, వివిధ సంక్షేమ పథకాల దరఖాస్తులు తదితర ప్రభుత్వ సేవలను ప్రజలు ఒకే చోట పొందేందుకు మీసేవ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. గతంలో చిన్న సర్టిఫికెట్ కావాలన్నా పట్టణాలకు వెళ్లి ఇబ్బందులు పడేవారని, ఇప్పుడు గ్రామంలోనే ఈ కేంద్రం ఏర్పాటు కావడం వల్ల వడూర్ పరిసర ప్రాంతాల ప్రజలకు సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. ఈ అవకాశాన్ని గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మీసేవ కేంద్రం నిర్వాహకులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్లిన మేనేజర్‌కు ఘన సన్మానం

**- నూతన మేనేజర్‌కు స్వాగతం పలికిన ఎస్బీఐ సీఎస్పీ నిర్వాహకులు**

సారంగాపూర్, జులై 09, ప్రభాతవార్త:



మండలంలోని కౌట్ల(బి) స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్‌గా విధులు నిర్వహించి, నిర్మల్‌కు బదిలీపై వెళ్తున్న గౌని నవీన్ కుమార్‌ను సీఎస్పీ నిర్వాహకులు గురువారం ఘనంగా సన్మానించారు. బ్యాంకులో ఆయన అందించిన సేవలను అభినందిస్తూ శాలువా కప్పి, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఆయన స్థానంలో హైదరాబాద్‌లోని లోతుకుంట బ్రాంచ్ నుండి కౌట్ల(బి) శాఖకు నూతనంగా బదిలీపై వచ్చిన మేనేజర్ గోగుర్ల నవీన్ కుమార్‌కు ఎస్బీఐ సీఎస్పీ నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సీఎస్పీ నిర్వాహకులు ఆర్మూర్ శ్రీనివాస్, సత్యనారాయణ, బ్యాంకు సిబ్బంది ఇలసారం క్రాంతి కుమార్, అడ్డిగ శరత్ తదితరులు పాల్గొన్నారు.

### కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో

## మంచిర్యాల జిల్లాకు 2వ స్థానం

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాశాఖ అధికారి పి.చంద్రయ్య, అధికారులతో కలిసి పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ 202526 నివేదికను విడుదల విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 202425 విద్యా సంవత్సరంలో 324 స్కోర్ తో జిల్లా 3వ స్థానంలో నిలువగా అన్ని విభాగాలలో ప్రతిభను మెరుగుపరచుకొని ఈ సంవత్సరం 360 స్కోర్ తో 2వ స్థానంలో నిలిచిందని, తెలంగాణ రాష్ట్రం తన స్థానాన్ని మెరుగుపరచుకొని జాతీయస్థాయిలో 18 వ స్థానంలో నిలవడం అభినందనీయమని తెలిపారు. ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలలో మూత్రశాలలు లేని పాఠశాలలను గుర్తించి మౌలిక వసతులను కల్పించడంతో పాటు అమ్మ ఆదర్శ పాఠశాల పనుల ద్వారా పాఠశాలలలో త్రాగునీరు, విద్యుత్, తరగతి గదులకు అవసరమైన మరమ్మత్తులు చేపట్టడం, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు, ఆదర్శ పాఠశాల లకు అనుబంధంగా ఉన్న బాలికల వసతి గృహాలలో విద్యార్థులకు అదనంగా వసతి గదులు, భోజనశాల, వంటశాల, మూత్రశాలలు, కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్ లు నిర్మించడము, ఆర్ఓ వాటర్ ప్లాంట్లను ఏర్పరచడం, ఇంటర్మీడియట్ బ్లాక్ లను నిర్మించడం వంటి చర్యలతో పాఠశాలలో మౌలిక వసతులు బలోపేతమై ఎక్కువ స్కోరు సాధించడం జరిగినదని తెలిపారు. పాఠశాలలలో పర్యవేక్షణ మెరుగుపరిచేందుకు దాదాపు 50 మంది సభ్యులతో 8 తనిఖీ బృందాలను ఏర్పాటు చేసి 485 పాఠశాలలను పూర్తి స్థాయిలో సమగ్రంగా తనిఖీ చేయడం జరిగిందని, డిజిటల్ విద్యను బలోపేతం చేయడం ద్వారా డిజిటల్ విద్యా విభాగంలో స్కోరు మెరుగైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారులు ఎం.భరత్ కుమార్, జంబోజు సత్తయ్య, కృష్ణమూర్తి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు

**- నిష్పాక్షిక విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి**

**- భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి డిమాండ్**

మంచిర్యాల, జూలై 9 ప్రభాతవార్త :

మాజీ మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు, భారతీయ జనతా పార్టీ నాయకుడు బేర సత్యనారాయణ నివాసంపై జరిగిన దాడి ఘటనపై ప్రత్యేక విచారణ జరిపి దాడికి పాల్పడిన వారితో పాటు కుట్ర వెనుక ఉన్న వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి గురువారం రామగుండం పోలీసు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులపై దాడులు జరగడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆరోపించారు. ఘటనపై పోలీసులు నిష్పాక్షికంగా విచారణ నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బేర సత్యనారాయణ, సత్రం రమేష్, అమ్మిరిశెట్టి రాజ్‌కుమార్, ఈర్ల సదానందం, రవి గౌడ్, గుండా ప్రభాకర్, కొండ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఖైరిగుర ఓసీ గనికి ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన

**- సింగరేణి పనితీరుపై ప్రశంసలుగోలేటి ప్రాజెక్ట్ వేగవంతానికి సూచనలు**

బెల్లంపల్లి, జూలై 09, ప్రభాతవార్త:



బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగుర ఉపరితల బొగ్గు గనిని ఆదిలాబాద్ లోక్‌సభ సభ్యుడు గోడం నగేష్, సిర్పూర్ అసెంబ్లీ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు గురువారం రోజున సందర్శించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శ్రీరమేష్ వారిని ఆత్మీయంగా స్వాగతించారు. పర్యటనలో భాగంగా ఎంపీ, ఎమ్మెల్యేలు వ్యూ పాయింట్ నుండి ఓపెన్‌కాస్ట్ గనిని పరిశీలించి, ఉత్పత్తి, ఉత్పాదకతపై వివరాలు తెలుసుకున్నారు. గనిలో జరుగుతున్న పనులు, భద్రతా చర్యలు, ఆధునిక యంత్రాల వినియోగంపై అధికారులతో చర్చించారు. సింగరేణి సంస్థ పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎంపీ గోడం నగేష్ ప్రశంసించారు. తాడిచర్ల2 బ్లాక్ కేటాయింపు కేంద్ర ప్రభుత్వ విజయమని పేర్కొన్నారు. గోలేటి ఉపరితల గని పనులను త్వరితగతిన ప్రారంభించాలని సింగరేణి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఖైరిగుర ప్రాజెక్ట్ అధికారి మచ్చగిరి నరేందర్, ప్రాజెక్ట్ ఇంజినీర్ వీరన్న, ఇంచార్జ మేనేజర్ గౌతమ్ రాజేష్ రెడ్డి, సీనియర్ పర్సనల్ అధికారి రజినికుమార్, జీఆర్ఎన్ కంపెనీ ప్రతినిధులు మరియు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దొంగల పట్టివేత

హాజీపూర్, జూలై 09,ప్రభాతవార్త:

నంనూర్ ఆర్ఆర్ కాలనీ దొంగతనం చేసిన దొంగను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు. ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం కరీంనగర్ జిల్లా కు చెందిన యాడవల్లి చందు, మ్యాన శివ అనే ఇద్దరు దొంగలు ఇంతకుముందు వేర్వేరు కేసులలో అరెస్ట్ అయి కరీంనగర్ జైలు ఉండగా పరిచయం జరిగింది. కరీంనగర్ జైలు నుండి బయటికి వచ్చిన తర్వాత ఇద్దరు కలిసి హైదరాబాద్‌లోని మొకిలా పోలీసు స్టేషన్ పరిదిలో దొంగతనం చేసినారు. అదేవిదంగా తేదీ మే నెల 24న రాత్రి సమయంలో వారిద్దరు కలిసి ఆర్ఆర్ కాలనీ, నంనూర్ గ్రామంలో, సీసీసీ నస్పూర్‌లో తాళం వేసి ఉన్న రెండు ఇండ్లలో బంగారం, వెండి ఆభరణాలు, డబ్బులు దొంతనం చేసి పారిపోయినారు. అందులో నుండి యాడవల్లి చందు అను నేరస్తుడిని గురువారం రోజున హాజీపూర్ గ్రామంలో పట్టుకొని అతని వద్ద నుండి 3.75 తులాల బంగారు ఆభరణాలు, 10 తులాల వెండి పట్టా గొలుసులను రికవరీ చేసి అతనిని రిమాండ్ నిమిత్తం కోర్ట్‌కు పంపించారు. మంచిర్యాల రూరల్ సీఐ రవీందర్ ఆధ్వర్యంలో కేసు డిటెక్ట్ చేసి నేరస్తున్ని అరెస్ట్ చేయడం లో ప్రతిభ కనబరిచిన హాజీపూర్ ఎస్ఐ కిరణ్ కుమార్, కానిస్టేబుళ్లసత్యనారాయణ, తిరుపతి, రాజేందర్‌లను ఉన్నతాదికారులు అబినందించినారు. హాజీపూర్ మండలంలోని ప్రజలు అందరూ వారి వారి ఇండ్లలో వ్యాపార సముదాయాలలో కాలనీలలో దిది కెమెరాలు పెట్టుకోవడం వలన దొంగతనాలు జరిగే అవకాశం ఉండదు. ఒక వేళ దొంగతనం జరిగిన దొంగలు తొందరగా దొరికే అవకాశం ఉంటుంది. కావున ప్రజలు అందరూ సీసీటీవీలు పెట్టుకొని నేర నివారణకు పోలీసు వారికి సహకరించాలని సీఐ, ఎస్ఐ తెలిపారు.




దొంగతనం చేసిన నిందితుడితో ఎస్ఐ కిరణ్ కుమార్, పోలీస్ సిబ్బంది

# బీడీ ఆకు కొనుగోళ్లలో డబ్బుల మళ్లింపు ఆరోపణలు

**తునికి ఆకు కూలీ డబ్బులు పక్కదారి - బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బాధితుల డిమాండ్**

**చింతలమనేపల్లి, జులై 9, ప్రభాతవార్త;**

మండలంలోని గూడెం, బూరుగూడ (ఏ) గ్రామాల బీడీ ఆకు కల్లేదారులు తీవ్ర అన్యాయం జరిగింది. బీడీ ఆకు కొనుగోలు ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ బాధితులు జిల్లా అటవీ అధికారికి ఫిర్యాదు చేశారు. తమ కల్లాలపై తొమ్మిది రోజుల పాటు బీడీ ఆకు సేకరణ, కొనుగోలు జరిగినప్పటికీ, వాస్తవంగా ఆకు సేకరించిన పలువురు కూలీల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా అటవీ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని కల్లేదారులు ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ శాఖ బీట్ అధికారి తనకు సన్నిహితులైన ప్లాంటేషన్ వాచర్ దేశ్ముఖ్ పవన్ (ప్రవీణ్), అలాగే గూడెం గ్రామానికి చెందిన రైతు గణపతి పేర్లపై పెద్ద మొత్తంలో బీడీ ఆకు కట్టలను అక్రమంగా నమోదు చేసి, వారి ఖాతాలకు డబ్బులు వెళ్లేలా చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. దేశ్ముఖ్ పవన్ పేరుపై 28,732 కట్టలు నమోదు చేసి సుమారు రూ. 97,705, రైతు గణపతి పేరుపై 12,408 కట్టలు నమోదు చేసి సుమారు రూ. 42,187 చెల్లింపులకు రికార్డులు సృష్టించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.



బీడీ ఆకు కొనుగోలు ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తున్న బాధితులు

గూడెం కల్లాల పరిధిలో మొత్తం 140 వేజ్ కార్డులు ఉండగా, పలువురు కల్లేదారుల కట్టలను తగ్గించడమే కాకుండా గూడెం గ్రామానికి చెందిన 13 మంది పేర్లను పూర్తిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా వదిలేశారు. దీంతో తమకు రావాల్సిన కూలీ డబ్బులు అందకుండా పోయాయని నీకాడి మధుకర్, దందరే ఓంకార్, కేడవోల్ కొండయ్య, కొంపర్ సత్తన్న, లేట్కార్ రంగయ్య, ఎడిగం బక్కు, దేవర సచిన్, దుబ్బుల జయప్రద, దేశ్ముఖ్ భిచ్చయ్య, కాటల రామక్క, దోకే వనిత, దేశ్ముఖ్ స్వప్న, కోటేల శంకర్ తదితర బాధితులు వాపోయారు. ఆన్‌లైన్‌లో నమోదు కాకుండా మిగిలిపోయిన కల్లేదారులకు వెంటనే కూలీ డబ్బులను చెల్లించాలని, ఈ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన అధికారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ వ్యవహారం బయటపడిన తర్వాత బీట్ ఫారెస్ట్ ఆఫీసర్ (ఎఫ్‌బీఓ) కొందరు కూలీలకు బీడీ ఆకు డబ్బులు అందజేసినట్లు బాధితులు పేర్కొన్నారు. అయితే మరికొందరు కూలీలు డబ్బులు స్వీకరించకుండా, ముందుగా అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు.

### విచారణ జరుపుతున్నాం, ఎఫ్ఆర్ఓ సుభాష్..

ఈ వ్యవహారంపై ఎఫ్ఆర్ఓ ను వివరణ కోరగా. ఈ అంశంపై ఇప్పటికే ఉన్నతాధికారులు విచారణకు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఆ మేరకు విచారణ చేపట్టామని, పూర్తి స్థాయిలో అన్ని అంశాలను పరిశీలించిన అనంతరం వాస్తవాలను నివేదిక రూపంలో వెల్లడిస్తామని స్పష్టం చేశారు.

## సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలి

**ఆసిఫాబాద్, జులై 9, ప్రభాతవార్త :**

సోషల్ మీడియా వేదికలను ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వినియోగించాలని గురువారం జిల్లా ఎస్పీ నితికా పంత్ ఒక ప్రకటనలో తెలిపారు. సోషల్ మీడియాలో ఎవరైనా ఉద్దేశపూర్వకంగా కించపరిచే పోస్టులు, వ్యాఖ్యలు, అసత్య ప్రచారాలు, అవమానకరమైన సందేశాలు గాని సామాజిక విద్వేషాలను రెచ్చగొట్టే కంటెంట్‌ను ప్రచారం చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ఇలాంటి నేరాలకు పాల్పడిన వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకుంటూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అనుమానాస్పద, చట్టవిరుద్ధ పోస్టులు కనిపిస్తే వెంటనే పోలీసులకు గాని అత్యవసర సేవల నంబర్ 100/112 ద్వారా సమాచారం అందించాలని కోరారు.

## బెల్లంపల్లిలో తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ 16,19, 23 సెలక్షన్స్

**బెల్లంపల్లి జులై 09, ప్రభాతవార్త**

తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బెల్లంపల్లిలో ఈ నెల 12వ తేదీన మంచిర్యాల జిల్లా మరియు కొమరం భీం జిల్లా స్థాయి అండర్ 16 అండర్ 19 అండర్ 23 క్రికెట్ ఎంపిక పోటీలు జరుగుతాయని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు పై డిమల్ల నర్సింగ్, కార్యదర్శి అల్లం వెంకటేశ్వర్లు, సీనియర్ కోచ్ జాడి శేఖర్ తెలిపారు. ఈ ఎంపిక పోటీలు స్థానిక శ్రీ మురళి మెమోరియల్ క్రికెట్ అకాడమీలో జరుగుతాయని వారు తెలిపారు. సెలక్షన్ కి వచ్చే క్రీడాకారులు తమ వెంట సొంత కిట్ బ్యాగు, వైట్ డ్రెస్ ,ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకుని రావాలి అని వారు తెలిపారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు హైదరాబాదులో నిర్వహించే జోనల్ ఎంపిక పోటీలలో పాల్గొంటారని వారు తెలిపారు. వివరాలకు 6281420 180, 798109809 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని వారు తెలిపారు.



## కోట వేణుగోపాల్ ఆధ్వర్యంలో బారెగూడలో ఘనంగా వనమహోత్సవం

**- ప్రతి ఇంటికి 6 మొక్కల పంపిణీ**

**కాగజ్‌నగర్ రూరల్, జులై 9, ప్రభాతవార్త :**



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా బారెగూడ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రతి ఇంటికి ఆరు మొక్కలను సర్పంచ్ కోట వేణుగోపాల్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోట వేణుగోపాల్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న మొక్కలను ప్రతి కుటుంబం తమ ఇంటి వద్ద తప్పనిసరిగా నాటి, వాటిని సంరక్షించాలని సూచించారు. పచ్చదనం పెంపొందితేనే స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన జీవనం, భావితరాలకు మెరుగైన భవిష్యత్తు సాధ్యమవుతుందని పేర్కొన్నారు.నేడు నాటే మొక్క... రేపటి తరాలకు అమూల్యమైన కానుక అనే సందేశంతో గ్రామ ప్రజలకు మొక్కల ప్రాధాన్యతను వివరించి, ప్రతి ఒక్కరూ వనమహోత్సవంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్, ఉపసర్పంచ్ వెంకటేష్, వార్డు సభ్యుడు హరీష్, పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## బస్టాండ్ కోసం స్థల పరిశీలన

**బెజ్జూర్, జూలై 9, ప్రభాతవార్త:**



బెజ్జూరు మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మాణం కోసం స్థలాన్ని గురువారం తహసిల్దార్ పి.రామ్మోహన్‌రావు పరిశీలించారు. బస్టాండ్ నిర్మాణం కోసం స్థలం అనుకూలంగా ఉన్నట్లు ఆయన తెలిపారు.ఈ బస్టాండ్ నిర్మాణం వల్ల మండల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.బస్టాండ్ స్థలం కోసం హద్దులు ఏర్పాటు చేయాల్సిందిగా మండల సర్వేయర్ శ్రీకాంత్ ను ఆదేశించినట్లు తెలిపారు.నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని అన్నారు.స్థలాన్ని పరిశీలించిన వారిలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ రవీంద్ర,మండల సర్వేయర్ శ్రీకాంత్ ఉన్నారు.




జెండా ఆవిష్కరిస్తున్న ఏబీవీపీ నాయకులు

## ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

**బెజ్జూర్,జూలై 9,ప్రభాతవార్త:**

బెజ్జూర్ మండల కేంద్రంలో గురువారం ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.అనంతరం ఏబీవీపీ ఆవిర్భవించి నేటితో 78 సంవత్సరాలు పూర్తయిందని అప్పటినుండి ఇప్పటివరకు విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూనే ఉందని ఏబీవీపీ మండల ఇన్చార్జి విశ్వంత్ గౌడ్ అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఉమ్మెర బాలకృష్ణ,తంగేడిపల్లి నిలేష్,ఏలేశ్వరం రమేష్,రామయ్య యాదవ్,లింగం పద్మాకర్,సామల తిరుపతి,ఏబీవీపీ కార్యకర్తలు కంబాల అన్వేష్,చరణ్, అంజన్న, కౌశిక్,ప్రవీణ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## 11న జిల్లా ఇన్చార్జి మంత్రి రాక

**- అదనపు పి.ఎస్. టు మినిస్టర్ నానిల్ కుమార్**

**కెరమెరి జూలై 9, ప్రభాతవార్త:**

ఈ నెల 11వ తేదీన రాష్ట్ర ఆబ్కారీ మద్య నిషేధ, పర్యాటక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లాకు రానున్నారని అదనపు పి.ఎస్. టు మినిస్టర్ నానిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11వ తేదీ ఉదయం 9 గంటల నుండి 10 గంటల వరకు ఆసిఫాబాద్ మండలం మాణిక్ గూడ గ్రామంలో గ్రామపంచాయతీ భవనం, కెరమెరి మండలం ధనోరలో వి.ఓ. భవనం, వాంకిడి మండలం కోమటిగూడలో గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభిస్తారని తెలిపారు. 10.30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఆసిఫాబాద్ మండల కేంద్రంలోని వడపల్లి గార్డెన్ లో ఏర్పాటు చేసిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ అవగాహన కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు.

## నేడు రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్

**బెల్లంపల్లి, జూలై 09, ప్రభాతవార్త**

విద్యారంగ సమస్యలపై విద్యార్థి సంఘాల తీవ్ర ఆందోళన, రాష్ట్రంలో విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ పలు విద్యార్థి సంఘాలు జూలై 10న రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చాయి. ప్రభుత్వం విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపిస్తూ ఈ బంద్‌ను చేపడుతున్నట్లు సంఘాల నాయకులు వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలు అనేక సమస్యలతో సతమతమవుతున్నాయని వారు పేర్కొన్నారు. ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతుల లోపం, హాస్టల్ సదుపాయాల లేమి కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులు వసూలు చేయడం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని విమర్శించారు. విద్యను వాణిజ్య వస్తువుగా మార్చే విధానాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఆరోపిస్తూ, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందించాలని కోరారు. ఇంకా, పెండింగ్‌లో ఉన్న విద్యా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతున్నారని, మండల విద్యాధికారి, జిల్లా విద్యాధికారి స్థాయిలో సరైన పర్యవేక్షణ లేదని ఆరోపించారు. పాఠశాలల్లో కనీస సదుపాయాలు లేకపోవడం, ఇంటర్మీడియట్ మరియు ఉన్నత విద్యా వ్యవస్థలో అనేక లోపాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, జూనియర్ మరియు డిగ్రీ కాలేజీలు, యూనివర్సిటీలలో బంద్‌ను విజయవంతం చేయాలని విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ బంద్‌కు ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పిడిఎస్యు, ఏఐడీఎస్ఓ , ఏఐఎస్బి,ఏపీఎస్యు వంటి పలు సంఘాలు మద్దతు ప్రకటించాయి. విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ ఆందోళనను విజయవంతం చేయాలని, ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యా సమస్యలను పరిష్కరించాలని సంఘాల నాయకులు హెచ్చరించారు.



## బలహన్‌పూర్ గ్రామానికి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలి

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూలై 09, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం రేచీని గ్రామపంచాయతీ పరిధిలోని బలహన్‌పూర్ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలని సిపిఐ తాండూర్ మండల కార్యదర్శి కొండు బానేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలహన్‌పూర్ గ్రామంలో సుమారు 150 మంది జనాభా, 30 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని తెలిపారు. అయితే ఆ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లేకపోవడంతో సుమారు 20 మంది చిన్నారులు విద్య కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం విద్యార్థులు రోజూ సుమారు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న రేచీని గ్రామానికి కాలినడకన వెళ్లి చదువుకుంటున్నారని, ఇంటి నుంచి బడికి వెళ్లిన పిల్లలు సురక్షితంగా తిరిగి ఇంటికి చేరే వరకు తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సి న పరిస్థితి నెలకొన్నదని చెప్పారు. కొంతమంది విద్యార్థులు చుట్టాల ఇళ్లలో ఉంటూ చదువుకుంటుండగా, మరికొందరు గురుకుల పాఠశాలల్లో చేరాల్సి వస్తోందన్నారు. ఇంకొందరు మార్గం లేక ఇంటి వద్దే ఉండి తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయ పనులకు వెళ్తూ బాల కార్మికులుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో 2004 వరకు ఈ గ్రామంలో మర్రిచెట్టు కింద ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నడిచేదని, భవనం లేకపోవడం వల్ల వర్షాకాలంలో తరగతులు నిలిచిపోయేవని, చివరికి పాఠశాలనే రద్దు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం బలహన్‌పూర్ గ్రామానికి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మంజూరు చేస్తే, గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా భవనం కోసం స్థలం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. చిన్నారులు ఇంత దూరం నడవలేకపోతున్నారని, వారి విద్యా భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని అన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి బలహన్‌పూర్ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఆగస్టు 2న ఏఐటీయూసీ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి: బాజీ సైదా

### - శ్రీరాంపూర్ ఆర్.కె-7 గనిపై మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

**నస్పూర్, జూలై 9, ప్రభాతవార్త**

ఆగస్టు 2వ తేదీన మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ఏఐటీయూసీ మంచిర్యాల జిల్లా మహాసభలను కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని గుర్తింపు కార్మిక సంఘం (ఏఐటీయూసీ) శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా పిలుపునిచ్చారు. మహాసభల ప్రచార కార్యక్రమాల్లో భాగంగా గురువారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్.కె-7 గనిపై ఏఐటీయూసీ బ్రాంచ్ ఆధ్వర్యంలో మహాసభల పోస్టర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ కొట్టే కిషన్‌రావు, అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి మోత్కూరి కొమురయ్యలతో కలిసి ఆయన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ జిల్లా మహాసభల్లో కార్మికుల సమస్యలతో పాటు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌పై సమగ్ర చర్చ జరిపి, వాటికి వ్యతిరేకంగా కీలక తీర్మానాలు చేయనున్నట్లు ఏఐటీయూసీ నాయకులు వెల్లడించారు. కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా మార్చడం, పని గంటలను పెంచడం వంటి కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను సంఘటిత పోరాటాలతో తిప్పికొడుతామన్నారు. ఆగస్టు 2న జరిగే మహాసభలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు యూసఫ్, వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జీఎం చర్చల ప్రతినిధులు బద్రి బుచ్చయ్య, బాలకృష్ణ, పిట్ సెక్రటరీ మారేపల్లి సారయ్య, మీడియా అధికార ప్రతినిధి రాజ్‌కుమార్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ సదానందం, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు రమేష్, శ్రీనివాస్, షిఫ్ట్ సెక్రటరీ దుర్గం బానేష్, నాయకులు శంకర్, పవన్, శ్రీకాంత్, మోహన్, పిట్ కమిటీ, మైన్స్ కమిటీ, సేఫ్టీ కమిటీ సభ్యులు, కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.



# శంషాబాద్ విమానాశ్రయంలో కేంద్ర మంత్రికి ఘనస్వాగతం

### తాడిచెర్ల-2 బొగ్గు గని కేటాయింపుపై కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన రఘునాథ్ వెరబెల్లి

**మంచిర్యాల, జూలై 9, ప్రభాతవార్త**

శంషాబాద్ విమానాశ్రయంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి భారతీయ జనతా పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సింగరేణి సంస్థకు తాడిచెర్ల-2 బొగ్గు గనిని కేటాయించడంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం సింగరేణి సంస్థ అభివృద్ధికి, బొగ్గు ఉత్పత్తి పెరుగుదలకు, స్థానిక యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించడానికి దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు రంగం అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, సింగరేణి సంస్థ మరింత బలోపేతం కావడానికి ఈ కేటాయింపు ఎంతో ఉపయోగపడుతుందని రఘునాథ్ వెరబెల్లి అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు దుర్గం అశోక్, కందుల సంధ్యారాణి, సునీల్ రెడ్డి, ముకేశ్ గౌడ్, అందుగుల శ్రీనివాస్, పూనమ్ చంద్ తదితరులు పాల్గొన్నారు.



కిషన్‌రెడ్డిని కలిసిన బిజెపి నాయకులు

## సమాచార హక్కు చట్టం అమలుకు చర్యలు తీసుకోవాలని వినతి

### - జిల్లా అధికారులను సన్మానించిన సమాచార హక్కు వికాస సమితి ప్రతినిధులు

**మంచిర్యాల, జూలై 9, ప్రభాతవార్త**



ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సమాచార హక్కు చట్టానికి సంబంధించిన సమాచార ఫలకాలు ఏర్పాటు చేసి, చట్టంలోని నిబంధనలను సమర్థంగా అమలు చేయాలని సమాచార హక్కు వికాస సమితి ప్రతినిధులు జిల్లా అధికారులను కోరారు. గురువారం కలెక్టరేట్‌లో నూతన పరిపాలనాధికారి దేశ్‌పాండే శ్రీనివాసరావు, జిల్లా రెవెన్యూ అధికారి మోతీరాం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్‌లను శాలువాలతో సన్మానించి వినతిపత్రం అందజేశారు. తమ విజ్ఞప్తులపై అధికారులు సానుకూలంగా స్పందించి, సమాచార ఫలకాల ఏర్పాటు, చట్టం అమలుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమితి ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఉప్పుల రామకృష్ణ, కాసర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పోచమ్మ తల్లి ఆలయంలోని విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న మాజీ డిసిసి అధ్యక్షురాలు

## నల్ల పోచమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి రూ.50 వేల విరాళం

### - విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్న కొక్కిరాల సురేఖ ప్రేమ్‌సాగర్‌రావు

**మంచిర్యాల, జూలై 9, ప్రభాతవార్త**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ 19వ విభాగంలో నూతనంగా నిర్మించిన శ్రీ నల్ల పోచమ్మ తల్లి దేవాలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో జిల్లా మాజీ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కోసం రూ.50 వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా తల్లి ఆశీస్సులతో రైతులు, నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆమెను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మేయర్ ధర్ని మధుకర్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు, కార్పొరేటర్ తూముల నరేష్, స్థానిక కార్పొరేటర్ కాకుల వరలక్ష్మి-యువరాజ్, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అధికారులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలి

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**బెల్లంపల్లి జూలై 09, ప్రభాతవార్త**



ప్రభుత్వ అధికారులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని బెల్లంపల్లి మండలం తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి హాజరు పట్టికలు, కార్యాలయ రికార్డులు, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ వివరాల నమోదు అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారులు, సిబ్బంది విదుల పట్ల సమయపాలన పాటించాలని, వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలతో జవాబుదారీగా వ్యవహరించాలని తెలిపారు. ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలని, ఈ నెల 24వ తేదీ లోగా ప్రక్రియ పూర్తి చేసే విధంగా పనులు వేగవంతం చేయాలని తెలిపారు. ఓటర్ల నుండి సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాలలో పొందుపరిచిన సమాచారాన్ని బి.ఎల్.ఓ. యాప్ లో స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. వివిధ ధ్రువపత్రాల కొరకు అందిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులుగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి సబ్ కలెక్టర్ మనోజ్‌తో కలిసి భూభారతి పెండేసి వివరాలను పరిశీలించారు. వివిధ భూ సమస్యలపై భూభారతి రెవెన్యూ సదస్సులలో అందిన దరఖాస్తులను రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించే విధంగా కృషి చేయాలని తెలిపారు.

అనంతరం నెన్నెల మండలం ఆవడంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మండల తహసిల్దార్ శ్రీనివాస్‌తో కలిసి సందర్శించి తరగతి గదులు, మధ్యాహ్న భోజనం పథకం అమలు, సైన్స్ వేర్ నిర్వహణ, రిజిస్టర్లను పరిశీలించారు. అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని, ప్రతి ప్రభుత్వ పాఠశాలలో త్రాగునీరు, విద్యుత్, విద్యార్థినీ, విద్యార్థులకు వేరువేరుగా మూత్రశాలలు, భోజనశాల, అదనపు గదులు, ప్రహరీ గోడ ఇతర సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల జిల్లా విద్యారంగంలో దేశంలో, రాష్ట్రంలో ఉన్నత స్థానాలలో నిలిచిందని, జిల్లాలో దాదాపు 320 మంది ఉపాధ్యాయులను నియమించడం జరిగిందని, అడ్మిషన్లలో జిల్లా మొదటి స్థానంలో ఉందని తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ విద్యా సంవత్సరంలో 3 శాతం విద్యార్థుల సంఖ్య పెరిగిందని, ఒక గుర్తింపు ద్వారా 75 శాతం హాజరు నమోదు అవుతుందని తెలిపారు. జిల్లాలో 700 లకు పైగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, ఈ పాఠశాలలలో దాదాపు 44 వేల మంది విద్యార్థులు చదువుతున్నారని, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో సకల సౌకర్యాలతో విద్యార్థులకు విద్యా అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో విద్యారంగంలో 150 కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరిగిందని, ఇందులో సి.ఎస్.ఆర్. 80 కోట్ల రూపాయలు, ఈ.జి.ఎస్. 20 కోట్ల రూపాయలు, సమగ్ర శిక్ష 11 కోట్ల రూపాయలు, నాబార్డు 6 కోట్ల రూపాయలు, ప్రధానమంత్రి జన్ మన్ 3 కోట్ల రూపాయలు, ప్రధానమంత్రి జుగా 3 కోట్ల రూపాయలతో పాటు ప్రభుత్వ నిధులతో పాఠశాలల అభివృద్ధి చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. హరే రామ హరే కృష్ణ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను కల్పిస్తున్న సౌకర్యాలతో పాఠశాలలలో అడ్మిషన్లు అడుగుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ కోర్టులో హాజరైన ఓయూ బీఆర్ఎస్వీ నేతలు

## గురుకుల సమస్యలు ప్రశ్నించినందుకు అక్రమ కేసులు: బీఆర్ఎస్వీ ఆరోపణ

**నిర్మల్, జూలై 09, ప్రభాతవార్త:**

గురుకులాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రశ్నించినందుకు తమపై కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షతో అక్రమ కేసులు బనాయించిందని ఉస్మానియా యూనివర్సిటీ బీఆర్ఎస్వీ నాయకులు ఆరోపించారు. ఈ కేసు విచారణలో భాగంగా బుధవారం నిర్మల్ ప్రథమ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు ఓయూ బీఆర్ఎస్వీ నాయకులు నాగేందర్ కోదాటి, బాలెంల అవినాష్ హాజరయ్యారు. 2024లో భారత రాష్ట్ర సమితి పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన "గురుకుల బాట" కార్యక్రమంలో భాగంగా నిర్మల్ జిల్లాలోని గురుకుల పాఠశాలలను సందర్శించామని వారు తెలిపారు. ఆ సమయంలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, తాగునీరు, వసతి, భద్రత, మౌలిక వసతుల కొరత వంటి సమస్యలను పరిశీలించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించామని వివరించారు. ఈ కార్యక్రమాన్ని అడ్డుకునే ఉద్దేశంతోనే నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో తమపై అక్రమ కేసు నమోదు చేశారని నాగేందర్ కోదాటి, బాలెంల అవినాష్ ఆరోపించారు. కోర్టు విచారణ అనంతరం వారు మాట్లాడుతూ, "విద్యార్థుల హక్కుల కోసం పోరాడటం నేరం కాదు. గురుకులాల్లోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులు, విద్యార్థి నాయకులు, యువతపై వరుసగా అక్రమ కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తోంది" అని విమర్శించారు. "ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, ఎన్ని కోర్టులకు పిలిచినా విద్యార్థుల హక్కుల కోసం మా పోరాటం ఆగదు. కేసులకు, జైళ్లకు భయపడేది లేదు. ప్రజల కోసం, విద్యార్థుల కోసం చివరి వరకు పోరాడుతాం" అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలను వెంటనే విరమించుకుని, కేసులు పెట్టడానికి బదులు గురుకులాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య, మెరుగైన వసతుల కోసం బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో పోరాటం నిరంతరం కొనసాగుతుందని తెలిపారు.



న్యాయవ్యవస్థపై తమకు పూర్తి విశ్వాసం ఉందని, చట్టాన్ని గౌరవిస్తూ కోర్టు విచారణకు హాజరవుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నిర్మల్ జిల్లా టౌన్ అధ్యక్షుడు మారగొండ రాము, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు, ఉపాధ్యక్షులు షోయబ్, నయీం, మసూద్, జుబేర్, ఉస్మాన్, రిజ్వాన్, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.



# మానవత్వాన్ని చాటిన సీనియర్ సిటిజన్స్

**బెల్లంపల్లి, జూలై 09, ప్రభాతవార్త:**

బెల్లంపల్లి నెంబర్ 2 గ్రౌండ్ సీనియర్ సిటిజన్స్ వాకర్స్ మానవత్వాన్ని చాటుకున్నారు. స్థానిక టేకుల బస్తీకి చెందిన నరసింహులు భార్య స్రవంతి అనారోగ్య పరిస్థితుల్లో కరీంనగర్‌లోని ఆసుపత్రిలో వైద్యం పొందుతున్నందువల్ల వారి ఆర్థిక పరిస్థితిని గమనించిన సీనియర్ సిటిజన్స్ విరాళాలు సేకరించి ఆమె వైద్యం కోసం గురువారం అందజేశారు. మొత్తం 17,700 రూపాయలను విరాళాలుగా సేకరించి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వాకర్స్ పాల్గొన్నారు.

# మాంగ్ కులస్తులకు కుల ధ్రువీకరణ పత్రాలపై జీవో: సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం

- తహసీల్దార్ కార్యాలయాల ద్వారానే సర్టిఫికెట్ల జారీ..
- ప్రభుత్వం ఉత్తర్వులుఆర్డీవో ఆఫీసుల చుట్టూ తిరిగే ఇబ్బందులు తప్పాయన్న మాంగ్ సమాజ్ సంఘం

**జైనూర్, జులై 9, ప్రభాతవార్త:**

మాంగ్ కులస్తులకు తహసీల్దార్ కార్యాలయాల ద్వారానే కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని ఉషగాం గ్రామంలో గురువారం మాంగ్ సమాజ్ సంఘం ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర సామాజిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మాంగ్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు గాయక్‌వాడ్ తులసీదాస్ మాంగ్ చిత్రపటాలకు నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు మావలే దత్త మాంగ్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాంగ్ కులస్తుల చిరకాల డిమాండ్‌ను నెరవేర్చుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయాల ద్వారానే కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం హర్షణీయమన్నారు. గతంలో ఆర్డీవో కార్యాలయాల ద్వారా కుల ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు మాంగ్ సమాజ్ ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, తాజా నిర్ణయంతో ఆ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించిందని తెలిపారు. మాంగ్ కులస్తుల అస్తిత్వాన్ని, హక్కులను పరిరక్షించే విధంగా ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి సమాజం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉషగాం సర్పంచ్ ఆత్రం నిర్మల శశిపాల్, జంగాం మాజీ సర్పంచ్ కుమ్ర శ్యాంరావు, ఉషగాం మాంగ్ సమాజ్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఏడులే ప్రకాష్, సంఘం ప్రముఖ నాయకులు కాంబ్లే సంగ్రామ్ మాంగ్, మోరే మహాదేవ్ మాంగ్, తారుడే గ్యానోబ మాంగ్, సూర్యవంశీ దత్త మాంగ్, మాంగ్ సమాజ్ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న మాంగ్ సమాజ్ నాయకులు



ఎస్సార్పీ ఓసీపీపై స్వీట్లు పంపిణీ చేస్తున్న బిఎంఎస్ నాయకులు, కార్మికులు

# సింగరేణికి తాడిచెర్ల బ్లాక్2 కేటాయింపుపై బిఎంఎస్ సంబరాలు

- కేంద్ర మంత్రి సానుకూల స్పందనతో శ్రీరాంపూర్‌లో స్వీట్ల పంపిణీ

**నస్పూర్, జూలై 9, ప్రభాతవార్త**

తాడిచెర్ల బొగ్గు బ్లాక్2 ప్రాజెక్టును సింగరేణి సంస్థకు కేటాయించే అంశంపై కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందించడం పట్ల సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బిఎంఎస్) హర్షం వ్యక్తం చేసింది. శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పీ ఓసీపీ ప్రాజెక్టుపై బీఎంఎస్ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి బాణాసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. సింగరేణిలోని పలు గనుల్లో బొగ్గు నిల్వలు తగ్గిపోతున్న తరుణంలో, వేలాది మంది కార్మికుల ఉపాధిని కాపాడటానికి 277 మిలియన్ టన్నుల నిల్వలు గల తాడిచెర్ల బ్లాక్2ను సింగరేణికే కేటాయించాలని కోరుతూ బీఎంఎస్ ప్రతినిధుల బృందం ఇటీవల కేంద్ర మంత్రికి వినతిపత్రం సమర్పించింది. ఈ డిమాండ్‌పై కేంద్ర మంత్రి సానుకూలత వ్యక్తం చేయడంతో, సింగరేణి యాజమాన్యం తదుపరి చర్యలు వేగవంతం చేయాలని బీఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. కోల్ ఇండియా యాజమాన్యం లేబర్ కోడ్‌ల అమలుపై చూపుతున్న శ్రద్ధను, బొగ్గు గని కార్మికుల 12వ వేతన కమిటీ నోటిఫికేషన్ జారీ చేయడంలో చూపడం లేదని బీఎంఎస్ నాయకులు విమర్శించారు. ఈ వైఖరికి నిరసనగా దశలవారీ ఆందోళనల్లో భాగంగా ఆగస్టు 17 నుండి 23 వరకు దేశంలోని అన్ని బొగ్గు గనుల్లో కార్మికులకు అవగాహన కల్పించేలా భారీ సదస్సులు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఏరియా ఉపాధ్యక్షులు నాతాడి శ్రీధర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బిఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి సత్తన్న, సెక్రటరీ రాజారామ్ కిరణ్ కుమార్, ఏరియా జాయింట్ సెక్రటరీ జల్లా తిరుపతి, ఆర్గనైజింగ్ సెక్రటరీ కన్నెవేని సాగర్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ నాగార్జున నాయక్, ఎస్ఆర్పీ ఓసీ పిట్ సెక్రటరీ గోళ్ళ సురేష్, శనిగారపు శ్రీనివాస్, చిట్యాల వెంకటేష్, బైరి విష్ణుదాస్, మిద్దెపాక శ్రీరాములు, రాజేశ్వరరావు, కుడుక సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# ప్రైవేట్ పాఠశాలల్లో నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలి

- ఎంఈఓకు బీఎస్పీ నాయకుల వినతిపత్రం

**మందమర్రి, జూలై 09, ప్రభాతవార్త:**

మందమర్రి మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని కోరుతూ బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు మందమర్రి మండల విద్యాశాఖ అధికారి రాథోడ్ రమేష్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీఎస్పీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల అనుమతులు, మౌలిక వసతులు, ఫీజుల పట్టికలు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని కోరారు. అలాగే విద్యా హక్కు చట్టం నిబంధనలను పటిష్టంగా అమలు చేసి విద్యార్థులు, తల్లిదండ్రులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించే విద్యాసంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, పారదర్శకతతో విద్యా వ్యవస్థను నిర్వహించేలా పర్యవేక్షణ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ చెన్నూర్ నియోజకవర్గ అధ్యక్షుడు గాజుల శంకర్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఎం.డి. మాతిన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# పిడిఎస్ బియ్యం పట్టివేత

**హాజీపూర్, జూలై 09, ప్రభాతవార్త:**

మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని 16వ వార్డు ముల్కల్లలో అక్రమంగా నిల్వ ఉంచిన పిడిఎస్ బియ్యన్ని హాజీపూర్ మండల తహసీల్దార్ పుష్పలత పట్టుకున్న పిడిఎస్ బియ్యాన్ని సీజ్ చేశారు. ముల్కల్ల గ్రామానికి చెందిన ఆసది. రమాదేవి అనే మహిళా ఈ బియ్యన్ని అక్రమంగా కొనుగోలు చేసి నిల్వ ఉంచారు. మూడు క్వింటల్ల అరవై కిలోల బియ్యన్ని సీజ్ చేసి పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించి, నిందుతురాలు పై కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.



# తవ్వారు... వదిలేశారు!

- ఆరు నెలలుగా నత్తనడకన డ్రైనేజీ పనులు
- అసంపూర్తి కాలువతో కార్మికులు, వ్యాపారులకు నరకయాతన
- మురుగునీరు నిల్వతో దోమలు, ఈగలు, పందుల సంచారం



**మందమర్రి, జూలై 9, ప్రభాతవార్త:**

సింగరేణి కార్మికుల సౌకర్యం కోసం ప్రారంభించిన డ్రైనేజీ పునరుద్ధరణ పనులు నత్తనడకన సాగుతుండటంతో మందమర్రి మార్కెట్ ప్రాంత ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులు ప్రారంభించి నెలలు గడుస్తున్నా పూర్తికాకపోవడంతో అసంపూర్తిగా ఉన్న కాలువ ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మందమర్రి మార్కెట్ ప్రాంతంలోని సింగరేణి టి టైప్ క్వార్టర్స్ వెనుక భాగంలో డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించేందుకు సింగరేణి యాజమాన్యం పనులు చేపట్టింది. డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించడంతో పాటు దానికి అనుసంధానంగా ఉన్న కాలువను పునర్నిర్మించేందుకు తవ్వకాలు ప్రారంభించినప్పటికీ, పనులు మాత్రం ఆశించిన వేగంతో ముందుకు సాగడం లేదని స్థానికులు చెబుతున్నారు. సుమారు ఆరు నెలలుగా పనులు కొనసాగుతున్నా, ఇప్పటికే ఉన్న కాలువను పూర్తిగా తవ్వేసి దాదాపు నెలరోజులు గడిచినా పునర్నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో ప్రజలకు నిత్య ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. కార్మికులు తమ క్వార్టర్లకు రాకపోకలు సాగించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, మార్కెట్ ప్రాంతంలోని వ్యాపారులు కూడా ఇబ్బందులకు గురవుతున్నారు. అసంపూర్తిగా వదిలేసిన కాలువలో మురుగునీరు నిల్వ ఉండటంతో పందులు సంచరిస్తూ ఆ ప్రాంతాన్ని ఆవాసంగా మార్చుకున్నాయని స్థానికులు చెబుతున్నారు. దోమలు, ఈగలు విపరీతంగా పెరగడంతో అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం నెలకొన్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసనతో పాటు అపరిశుభ్ర వాతావరణం ఏర్పడటంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొంటున్నారు. ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సింగరేణి యాజమాన్యం వెంటనే స్పందించి డ్రైనేజీ, కాలువ పునర్నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని మార్కెట్ ప్రాంత ప్రజలు, కార్మికులు, వ్యాపారులు కోరుతున్నారు.

## విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలి

- జిల్లా కలెక్టర్ కె.హరిత



**కెరమెరి, జూలై 9, ప్రభాతవార్త:**

ప్రభుత్వ పాఠశాలలను విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని జిల్లా కలెక్టర్ కెహరిత అన్నారు. గురువారం జిల్లాలోని కెరమెరి మండలం పెద్దపట్నాపూర్ లో గల గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల హాజరు పట్టిక, వంటగది, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు అవసరమైన సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో డ్రాప్ అవుట్ విద్యార్థులను గుర్తించి సోమవారంలోగా పాఠశాలలో ఉండేలా ఉపాధ్యాయులకు కృషి చేయాలని, ప్రతి విద్యార్థి ఆపార్ కార్డు కలిగి ఉండేలా చూడాలని తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం రుచికరమైన పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీరు అందించాలని తెలిపారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలి

- బోగస్ ఓట్ల తొలగింపుకు ఇదే మంచి అవకాశం: ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్
- ఖుబీర్, ముధోల్, భైంసా, తానూర్, బాసరల్లో భారీగా బోగస్ ఓట్లు ఉన్నాయని వెల్లడి




**భైంసా, జులై 09, ప్రభాతవార్త:**

నియోజకవర్గంలో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై, గ్రామాల వారీగా అందరి ఓట్లు నమోదు చేయించాలని ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ కోరారు. గురువారం భైంసా పట్టణంలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో ఎస్ఐఆర్ ప్రక్రియపై బీజేపీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. విదేశీయులు దేశంలోకి చొరబడకుండా నిరోధించడానికి ఈ ప్రక్రియ ఎంతో దోహదపడుతుందని, బోగస్ ఓట్ల తొలగింపుకు ఇది ఒక మంచి అవకాశమన్నారు. ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో గ్రామాల వారీగా బీఎల్ఓలకు బీజేపీ బూత్ లెవెల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) పూర్తిస్థాయిలో సహకరించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. భైంసాతో పాటు కుబీర్, ముధోల్, తానూర్, బాసర మండల కేంద్రాల్లో పెద్ద మొత్తంలో బోగస్ ఓట్లు ఉన్నాయని, ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా అక్రమాలన్నీ తేటతెల్లమవుతాయన్నారు. ఓటరు నమోదు, సవరణల్లో ఏవైనా అనుమానాలు ఉంటే తక్షణమే అధికారులను సంప్రదించాలని, అర్హులైన ఏ ఒక్కరూ ఓటు హక్కు కోల్పోకుండా చూడాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షులు రితీష్ రాథోడ్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా పశ్చిమ బెంగాల్‌లో దాదాపు 90 లక్షల బోగస్ ఓట్లను తొలగించిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో సైతం పెద్ద ఎత్తున బోగస్ ఓట్లు ఉన్నాయని, దేశం కోసం, ధర్మం కోసం నాయకులు, కార్యకర్తలు అంతా కంకణబద్ధులై ఈ ప్రక్రియకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్ఐఆర్ జిల్లా ఇన్‌చార్జ్ రావుల రాంనాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నారాయణరెడ్డి, ముధోల్ నియోజకవర్గ ఎస్ఐఆర్ ఇన్‌చార్జ్ పైడిపల్లి గంగాధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు అశోక్, ఏనుపోతుల మల్లేష్, భైంసా పట్టణ అధ్యక్షులు రావుల రాము, వివిధ మండలాల అధ్యక్షులు, మాజీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.



## ఆత్మహత్యకు యత్నించిన యువకుడిని కాపాడిన బాసర పోలీసులు

- పెళ్లి కావడం లేదని గోదావరి నదిలో దూకేందుకు యత్నం
- సమయస్ఫూర్తితో అడ్డుకుని, కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించిన ఖాకీలు

**భైంసా, జులై 09, ప్రభాతవార్త:**

పెళ్లి కావడం లేదనే మనస్తాపంతో పవిత్ర పుణ్యక్షేత్రమైన బాసర గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించిన ఓ యువకుడిని బాసర పోలీసులు సమయస్ఫూర్తితో వ్యవహరించి కాపాడారు. వివరాల్లోకి వెళ్తే.. మహారాష్ట్రలోని ధర్మాబాద్ రాంనగర్ కాలనీకి చెందిన గజానన్ అనే యువకుడు గత కొంతకాలంగా తనకు పెళ్లి కావడం లేదని తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. దీంతో మద్యానికి బానిసైన సదరు యువకుడు ఆత్మహత్య చేసుకోవాలనే ఉద్దేశంతో గురువారం మధ్యాహ్నం బాసర గోదావరి నది వద్దకు చేరుకున్నాడు. అక్కడ ఒంటరిగా అనుమానాస్పదంగా తిరుగుతున్న యువకుడిని గమనించిన స్థానికులు, వెంటనే అక్కడ విధుల్లో ఉన్న పోలీసులకు సమాచారం అందించారు. బాసర పోలీస్ బృందం మెరుపు వేగంతో స్పందించి, నదిలోకి దూకేందుకు సిద్ధమైన యువకుడిని చాకచక్యంగా పట్టుకుని అడ్డుకున్నారు. అనంతరం ఆ యువకుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించి, సీఐ దీపక్ ఆధ్వర్యంలో కౌన్సె లింగ్ నిర్వహించారు. ఆత్మహత్య దేనికి పరిష్కారం కాదని, జీవితంలో ధైర్యంగా ముందుకు సాగాలని నచ్చజెప్పారు. అనంతరం ధర్మాబాద్‌లో ఉంటున్న అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, యువకుడిని సురక్షితంగా వారికి అప్పగించారు. విధుల్లో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించి, ఒక నిండు ప్రాణాన్ని కాపాడిన బాసర సీఐ దీపక్, పోలీస్ సిబ్బందిని పలువురు ప్రముఖులు, స్థానికులు అభినందించారు.

## స్వర్ణ ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన ఎంపీడీవో లక్ష్మీకాంత్

**సారంగాపూర్, జులై 09, ప్రభాతవార్త:**

మండలంలోని స్వర్ణ (పొన్కూర్) గ్రామంలో గల ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి లక్ష్మీ మ్కాంత్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలలోని వసతుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటిని ఆన్‌లైన్ గూగుల్ ఫారంలో నమోదు చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా ఎంపీడీవో పాఠశాలలోని వంటగదిని, ఆహార పదార్థాల నిల్వ కేంద్రాన్ని పరిశీలించి భోజనం నాణ్యతను తనిఖీ చేశారు. వసతి గృహంలో అందుబాటులో ఉన్న మెడికల్ కిట్ (ప్రాథమిక చికిత్స విధానం), విద్యార్థినుల గదుల్లో ఫ్యాన్లు, లైట్లు, మరుగుదొడ్ల నిర్వహణ, తరగతి గదుల వసతులను ఆయన కూలంకషంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో నేరుగా మాట్లాడి పాఠశాలలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరు పట్టికను కూడా తనిఖీ చేశారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైనందున ఆశ్రమ పాఠశాల పరిసరాలను అత్యంత పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థినులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా నాణ్యమైన భోజనం, శుద్ధి చేసిన తాగునీరు అందించడంతో పాటు మెరుగైన విద్యాబోధన చేయాలన్నారు. ఇది బాలికల పాఠశాల కావున స్థానిక వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

